

క్రైమ్ స్టోరీ

# దుపట్టా కిల్లర్

పర్యాటకుల స్వర్గధామం.. గోవా. రాజధాని నగరం పనాజీ.

అక్కడికి 28 కిలోమీటర్ల దూరంలోని ఖాందేపర్‌లో ఓ పూరిల్లు. అందులో గులాబీ అనే యువతి నివసించేది. ఆ ఇంట్లో చీకటి పడేవరకూ కుట్టుమెషిన్ శబ్దాలు వినిపించేవి. ఒకరోజు ఆమె హత్యకు గురైంది. ఎవరో తలపై బండరాయితో మోది చంపేశారు. దుర్ఘటన జరిగిన ఇరవై నాలుగు గంటల తర్వాత ఆ విషయాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం వెళ్లింది. 'ఆమె రోజూ ఆటో స్టాండ్ దగ్గర ఒక గడ్డం మనిషితో మాట్లాడేది సార్' అని పోలీసులకు చెప్పాడు విచారణలో ఓ సాక్షి. పోలికలను బట్టి మహానంద్ అనే వ్యక్తిని కస్టడీలోకి తీసుకున్నారు ఖాకీలు. గులాబీ చనిపోయిన రోజు అతను ఆటో స్టాండ్ దగ్గరే ఉన్నాడని, ఎక్కడికీ వెళ్లలేదనీ ఇతర డ్రైవర్లు గట్టిగా చెప్పడంతో పోలీసులు మహానంద్‌ను వదిలేశారు. ఆ తర్వాత కూడా హత్యలు జరిగాయి. సీరియల్ హంతకుడు మాత్రం దొరకలేదు.

**భయం భయం..**

దర్శన పేదింటి బిడ్డ. వయసు ఇరవై. పనాజీ శివార్లలోని శిరోదాలో తల్లితో కలిసి జీవించేది. ఇద్దరూ వ్యవసాయ కూలీలే. హఠాత్తుగా ఓ రోజు చెట్టుకు శవమై వేలాడుతూ కనిపించింది. మెడ చుట్టూ దుపట్టా. ఆ ముసలి తల్లికి ఇదో శరాఘాతం. దర్శన మరణానికి కారణాలు తెలియలేదు. కారకులెవరో గుర్తించలేకపోయారు. ఎవరినీ అరెస్ట్ చేయలేదు. కానీ ఆత్మ'హత్య'లు మాత్రం ఆగలేదు. హంతకుడి వేలిముద్రలు మాత్రం ఒకే తీరుగా ఉన్నాయి. ఆ ఫింగర్ ప్రింట్స్ ఎవరివన్నది తేల్చలేకపోయారు పోలీసులు. ఆ పేరు తెలియని హంతకుడికి 'దుపట్టా కిల్లర్' అని పేరు పెట్టుకున్నారు. గోవా ప్రజల్ని ఒకటిన్నర దశాబ్దం పాటు తీవ్రంగా భయపెట్టాయి ఆ హత్యలు.